సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



తరిగొప్పుల: కల్లుగీత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి పోషయ్య అధ్యక్షతన ఎస్సై దూదిమెట్ల నరేష్, జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జొన్నగోని శ్రీనివాస్, తాళ్లపల్లి రాజు, జాగీరు మల్లేషం, జాగీరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో ఒగ్గు పూజారుల బోనాలు



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌లో ఆదివారం గొల్లకురుమలకు చెందిన ఇళ్లలో ఒగ్గు శివసత్తులు, మల్లన్నపట్నాలు, సంక్రాంతి బోనాలతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఒగ్గు పూజారులు బోనాలు చెల్లించారు.

నియామకం



అబ్బాస్

లింగాలఘణపురం: వడిచర్లకు చెందిన మహ్మద్ అబ్బాస్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు జాఫర్ షరీఫ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పొదుపు భవిష్యత్‌కు భరోసా

రఘునాథపల్లి: మనం చేసే పొదుపు ఆర్థిక అవసరాలు, భవిష్యత్‌కు భరోసాగా ఉంటుందని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి పొదుపు సంఘం వ్యవస్థాపకుడు, రిటైర్డ్ హెచ్ఎం మేకల శంకరయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఇబ్రహీంపూర్‌లో సంఘం 26వ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన భవనానికి ప్రహరీ, వాటాధనం పెంపు, ఫెర్టిలైజర్ షాపు ఏర్పాటుపై తీర్మానం చేశారు. సర్పంచ్ దొరగొల్ల ఐలమ్మ, సంఘం అధ్యక్షుడు మోర్తాల మహేందర్, యాదగిరి, శ్రీనివాస్, ప్రభాకర్, మైసారావు, శ్రీనివాస్‌రెడ్డి, చీకటి ప్రహ్లాద, బర్ల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి



చిల్పూరు: చిన్నపెండ్యాల సమీపంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయానికి సంబంధించిన సర్వే నంబరు 79సర్వేనంబర్‌లోని 6 గుంటల భూమిలో నిర్మించిన ప్రహరీని శనివారం రాత్రి ఆక్రమణ దారులు కూల్చి వేశారని వారిపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు అధికారులను కోరారు. ఆదివారం కూల్చి వేసిన ప్రహరీ, అక్రమంగా ఆలయానికి సంబంధించిన భూమిలో తీసిన పునాది, గార్లకుంటకు చెందిన పానాదిని ధ్వంసం చేసి మొరంతో పోసిన రోడ్డును సంఘం నాయకులు పరిశీలించి మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటేశ్వర్లు , ఆలయ భూమి పరిరక్షణ సమితి సభ్యుడు తాళ్లపల్లి ప్రవీణ్, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సమ్మయ్య, గజ్జెల దామోధర్, తాళ్లపల్లి క్రాంతి, పూజరి రాజమోహన్, లక్ష్మీనారాయణ, రవి, రంజిత్ పాల్గొన్నారు.

జనగామ రూరల్: బహుమతులు అందజేస్తున్న కన్నా పరశురాములు



నర్మెట: విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు



జనగామ రూరల్ : పట్టణంలో ఇంటి ఎదుట ముగ్గు వేస్తున్న కాలూరి గాయత్రి



దేవరుప్పల: ముగ్గు వేస్తున్న యువతులు



భోగి వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా భోగి వేడుకలను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే భోగి మంటలు వేస్తూ ఇళ్ల ఎదుట మహిళలు ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి నవ ధాన్యాలు పోశారు. సంస్కృతి సంప్రదాయాల మేరకు భిక్షాటన చేసే గంగిరెద్దులవారు, రామదాసు భక్తులు విన్యాసాలు, గేయాలతో సందడి చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు స్వచ్ఛంద సంస్థలు, యూత్ అసోసియేషన్ల ఆధ్వర్యాన ముగ్గులు, పతంగుల పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే పలు ఆలయాల్లో పండుగ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



లింగాలఘణపురం: కళ్లెంలో భోగి మంటల వద్ద గ్రామస్తులు



జఫర్‌గఢ్‌లో..



పాలకుర్తి టౌన్: తలపై భోగిపండ్లతో చిన్నారులు



బచ్చన్నపేట: భోగి మంటల వద్ద గ్రామస్తులు



బహుమతులు అందజేస్తున్న ఎస్సై శ్రవణ్‌కుమార్



తరిగొప్పుల: అక్కరాజుపల్లిలో సర్పంచ్, ఎస్సై



దేవరుప్పల: గంగిరెద్దు విన్యాసం

యువత క్రీడల్లో ముందుండాలి



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న సీఐ రాజు

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడా పోటీల ద్వారా గ్రామాల మధ్య స్నేహభావం నెలకొంటుందని, గ్రామీణ యువత క్రీడల్లో ముందుండాలని ఘన్‌పూర్ సీఐ సట్ల రాజు అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న గ్రామీణ క్రీడాపోటీలను సీఐ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇప్పగూడెంలో గ్రామీణ స్థాయి క్రీడోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని, గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మునిగెల రమేష్, ఎంపీటీసీ గండి విజయలక్ష్మి, నాయకులు గట్ల మల్లారెడ్డి, నీరటి సంపత్, లింగనబోయిన శ్రీకాంత్, మంద మహేందర్, తొడెంగల ఐలయ్య, పిట్టల నాగేష్, సోమయ్య, కిష్టయ్య, శ్రీను, అనీల్ తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: ఆంధ్రతండాలో జయ్‌సింగ్ రాథోడ్‌ను సత్కరిస్తున్న యూత్ సభ్యులు

రైజ్, బంజారాబాయ్ యూత్ ఆధ్వర్యంలో..

రఘునాథపల్లి: యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సంగారాభేరి రాష్ట్ర నాయకుడు జయ్‌సింగ్‌రాథోడ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆంధ్రతండాలో రైజ్ యూత్, బంజారాబాయ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి రెండు రోజుల వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ బానోత్ బన్సూర్య, యూత్ సభ్యులు మాలోతు నరేందర్, దరావత్ చంద్రశేఖర్, రాజేష్‌నాయక్, భూక్య శ్రీనివాస్, వెంకట్‌నాయక్, సినాద్రి పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి

లింగాలఘణపురం: క్రీడలు యువతలో స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని సర్పంచ్ విజయ్‌మనోహర్ అన్నారు. మండల కేంద్రంలో మండల స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపీటీసీ భిక్షపతి, వెంకటేశ్, క్రీడల నిర్వాహకులు కస్తూరి కౌశిక్, దాసరి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రానున్న ఎన్నికల్లో గెలుపు బీఆర్‌ఎస్‌దే'



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ

నర్మెట: రానున్న ఎంపీ, స్థానిక ఎన్నికల్లో గెలుపు బీఆర్‌ఎస్‌దేనని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్ అన్నారు. జెడ్పీ నిధులు రూ. 2 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు హైమస్ట్ లైట్లను మండల కేంద్రంలోని బీసీ కాలనీ, సాయిబాబాగుడి చౌరస్తాలో ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, ఉపాధ్యక్షుడు చెప్యాల మహిపాల్ రెడ్డి, వార్డు సభ్యులు పొన్నం బాలకృష్ణ, మహేందర్, సుధాకర్, కిరణ్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులతో విద్యానాథ్

బచ్చన్నపేట: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై కంకల సతీష్ అన్నారు. ఆదివారం పడమటికేశ్వాపూర్‌లో యువకులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్‌తో కలిసి అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, నాయకులు కొండి వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆలేటి ఎల్లవ్వ జాతరకు ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన జాతర ప్రాంగణం

పాలకుర్తి: పాలకుర్తి మండలం బమ్మెర పంచాయతీలో ఉన్న ఆలేటి ఎల్లవ్వ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు (సోమవారం) బండ్లు తిరుగుట, 16వ తేదీన బోనాలు, పట్నాలు, శివసత్తుల పూనకాల నడుమ జాతర ఉత్సవాలు జరుగుతాయి. కాగా జాతరకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు



రఘునాథపల్లి: అయోధ్య అక్షింతలతో భక్తులు

రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్‌లో అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక శివాలయంలో వేదపండితులు బెలిగిని శివప్రసాద్‌స్వామి శివుడికి అభిషేకాలు, అంజనేయస్వామికి చందనం వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా ఇంటింటికి వెళ్లి అయోధ్య అక్షింతలు అందజేశారు. సర్పంచ్ దొరగొల్ల అయిలమ్మ, దొరగొల్ల యాదగిరి, ఉప్పోజు పోతులూరి, కొండ అశోక్, పోకల శ్రీనివాస్, దొరగొల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసమే రామమందిరం

బచ్చన్నపేట: లోక కల్యాణార్థమే అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించారని బీజేపీ జిల్లా నాయకుడు గీస సందీప్ అన్నారు. మన్‌సాన్‌పల్లిలో అయోధ్య అక్షింతలను పుర వీధుల్లో ఊరేగించి ఇంటింటా పంపిణీ చేశారు. సర్పంచ్ పంజాల తారశ్రీధర్‌గౌడ్, పొన్నం వెంకటేష్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: అయోధ్య రాములోరి అక్షింతలను మండలంలోని తిమ్మంపేటలో భక్తులు, గ్రామస్తులు కలిసి భక్తిశ్రద్ధలతో ఇంటింటా పంపిణీ చేశారు. ముందుగా పాండురంగస్వామి ఆలయంలో శ్రీరాముడి పూజితఅక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి పుణ్యమూర్తిశర్మ, పాండురంగ భక్తులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం



జఫర్‌గఢ్: కల్యాణం తిలకిస్తున్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి శ్రీరంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని భోగి పండుగ సందర్భంగా ఆదివారం వైభవంగా నిర్వహించారు. పవిత్ర ధనుర్మాసం చివరి రోజును పురస్కరించుకుని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో గోదాదేవి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా పూజారుల వేదమంత్రాల నడుమ ఘనంగా చేపట్టారు. అర్చకులు కలకోట రంగాచార్యులు, రామానుజచార్యులు, శేషాచార్యులు పూజలు చేపట్టగా అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

కూనూర్‌లో..

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్‌లో రంగనాయక గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నెల్లుట్ల వకులాదేవి, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి



సత్యనారాయణ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వేముల సత్యనారాయణ(51) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మహిళలకు ఉచిత బస్‌పాస్ నిర్ణయంతో ఆటోలకు సరిగ్గా గిరాకీ లేకపోవడంతో గత కొద్దిరోజులుగా సత్యనారాయణ మనోవేదనకు గురవుతున్నాడు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా ఆటో నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొద్దిరోజులుగా సరిగ్గా గిరాకీ రావడం లేదు. పండుగ రోజు కూడా సరైన గిరాకీ లేకపోవడంతో మనోవేదనతో శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న మీదికొండ, ఛాగల్లు, స్టేషన్‌ఘన్‌పూర్ ఆటోయూనియన్ నాయకులు మీదికొండలో మృతదేహాన్ని సందర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఎల్లస్వామి, శ్రీనివాస్, గట్టుమల్లు, మధుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గంజాయి రవాణాదారుడి అరెస్ట్

జనగామ రూరల్ : మూడేళ్ల నుంచి గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని ఆదివారం జనగామ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని గిర్నిగడ్డ ప్రాంతానికి చెందిన కోల సాయిశివ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం జనగామ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా సాయిశివ పోలీసులను చూసి పారిపోతుండగా అతనిని పట్టుకున్నారు. అనంతరం విచారించి, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

దేవరుప్పుల : మండలంలోని కామారెడ్డిగూడెం-సీతారాంపురం గ్రామాల మధ్య ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. దేవరుప్పులకు చెందిన కారుపోతుల బద్రినాథ్, బోయిని నవీన్ సంక్రాంతి పండుగ నిమిత్తం స్కూటీపై స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో ఎంఎస్ఆర్ గార్డెన్ సమీపంలో ఎదురుగా సూర్యాపేట వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ఘటనలో గుర్తుతెలియని వ్యక్తితోపాటు బద్రినాథ్, బోయిని నవీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిని పోలీసుల పరిశీలించారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటలో రెంట సిద్దిమల్లయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, గ్రామానికి చెందిన నాయకుడు పోతుల రాములు యాదవ్ రూ. 5వేల సాయం బాధిత కుటుంబానికి అందించారు. నాయకులు బుడిగె రామచంద్రం, తుప్పతి నర్సింహులు, చంద్రయ్య, బాబు, లింగం, సిద్దులు, భాస్కర్, కొమురయ్య, కిష్టయ్య, సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న కాపర్ వైరు దొంగలు




వివరాలు సేకరిస్తున్న ఎస్సై

తరిగొప్పుల: కన్నేశారా చోరీ చేయాల్సిందే..కటిక చీకట్లోనూ కాపర్ వైరు కొట్టేయాల్సిందే. ప్రాణాపాయమని తెలిసినా విద్యుత్‌తో సయ్యాటలాడుతున్నారు. అర్ధరాత్రి మొదలు కోడి కూసేలోపు గుట్టుచప్పుడు కాకుండా కాపర్‌వైరు ఎత్తుకుపోతున్నారు. తరిగొప్పుల మండల పరిధిలో వారం వ్యవధిలో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసిన దొంగలు అందులోని కాపర్‌వైరు ఎత్తుకెళ్లారు. ఈనెల 8వ తేదీన అబ్దుల్‌నాగారం శివారులో కావటి పోషయ్య బావి వద్ద 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌వైరును దుండగులు ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే. కాగా ఆదివారం మండలంలోని జాలుబాయితండా శివారులో ముండావర్ వీరన్న బావి వద్ద 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు బొత్తలపర్రె శివారులోని జీడిగం సుధాకర్ వ్యవసాయ బావి వద్ద గల 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైరు దొంగలించారు. కాపర్ వైరు విలువ రూ.40వేల వరకు ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై నరేష్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.











సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేష్ (S.R) : 9849921793 (పాలకుర్తి)
యం.డి. ఖలీల్ (S.R) : 8179719313 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191